www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 ఆగస్టు 2025

డిగ్రీ కాలేజీలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో ఆరు సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి సోమవారం చెప్పారు. ఈనెల 18వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఆరు కోర్సులు ఇంగ్లీషు, మ్యాథ్స్, సోషల్ వర్క్, హిస్టరీ, జెకెసి తదితర సబ్జెక్టులకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి అదనపు అకడమిక్ క్రెడిట్లను సంపాదించుకోవాలని తెలిపారు. ప్రధానంగా జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు అవసరమైన అర్ధమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేటివ్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, కరంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై బోధన ఉటుందని చెప్పారు. విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి తమ విద్యా నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ, షేక్ పర్వీన్, కెవి.గణేష్‌కుమార్, జి.వెంకట్రావు, జివి.శారదాదేవి పాల్గొన్నారు.

ఖాకీలపై కనికరం లేదాయే..!

ఎన్నికల్లో పోలీసులకు కూటమి నేతల ఎడపెడా హామీలు

కానిస్టేబుల్ కొడుకుగా పోలీసులకు న్యాయం చేస్తానని పవన్‌కల్యాణ్ వాగ్దానం

ఏడాది దాటినా సరెండర్ లీవ్స్, టిఎ, డిఎ బకాయిలకు అతీగతీ కరువు

ఒక్కో ఉద్యోగికీ రూ.రెండు నుంచి రూ.మూడు లక్షలకుపైగా సొమ్ము పెండింగ్

వీక్లీఆఫ్ హామీ అమలుపై కూటమి సర్కార్ మౌనం

రెండు జిల్లాల్లో దాదాపు 3,500 మందికిపైగా పోలీసుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్‌కు పోలీసులపై కనికరం లేకుండాపోయింది. ఎన్నికల్లో పోలీసులకు ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది దాటినా పట్టించుకోని పరిస్థితి ఉంది. తాను కానిస్టేబుల్ కొడుకునని, అధికారంలోకి వచ్చాక పోలీసుల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన వపన్‌కళ్యాణ్ ఇప్పుడు తనకు ఏమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని పోలీస్ సిబ్బందిలో చర్చ సాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 3,500 మంది వరకూ కానిస్టేబుళ్లు ఉండగా, మరో 200 మంది సిఐలు, ఎస్‌ఐలు ఉన్నారు. పోలీస్‌లు వేళలతో సంబంధం లేకుండా నిత్యం విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆరోగ్యాలను ఫణంగా పెట్టి ఉద్యోగ బాధ్యతల్లో మునిగి తేలుతారు. అలాంటి పోలీస్ సిబ్బంది పట్ల కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన సరెండర్ లీవ్స్, టిఎ బిల్లుల బకాయిలు సైతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. పోలీసులకు సరెండర్ లీవ్స్ కింద ఏడాదికి 45 రోజులు వేతనం అదనంగా ఇస్తారు. ఈ సొమ్ములు మూడు విడతలుగా జనవరి, జులై, నవంబర్ నెలల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఏడాదిన్నరగా సరెండర్ లీవ్స్ సొమ్ము పోలీస్ సిబ్బందికి ఇవ్వని పరిస్థితి ఉంది. దీంతో ఒక్కో ఉద్యోగికి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల సొమ్ము ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. ఈ సొమ్ములొస్తే పిల్లల చదువుల కోసం ఉపయోగించుకోవాలని పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. పోలీస్ సిబ్బందికి టిఎ ఖర్చుల కింద నెలకు రూ.2,500 వరకూ ప్రభుత్వం అందిస్తోంది. ఎస్‌ఐ స్థాయి అధికారులకైతే నెలకు రూ.4,500 వరకూ వస్తోంది. ఏడాదిగా టిఎ సొమ్ము ప్రభుత్వం చెల్లించలేదు. రూ.లక్షల సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నప్పటికీ రాకపోవడంతో పోలీస్ సిబ్బంది నానాయాతన పడుతున్నారు. మూడు డిఎ బకాయిలపై బకాయిలపై ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేకుండాపోయింది. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తమను మోసం చేశారంటూ పోలీసుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. తమ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

వీక్లీ ఆఫ్ అమలు చేయరు.. టర్మ్ డ్యూటీలతో నరకం

తాము అధికారంలోకి వస్తే పోలీస్ సిబ్బందికి వీక్లీ ఆఫ్ (వారాంతపు సెలవు) ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా ఇప్పటికీ వీక్లీఆఫ్ గురించి ప్రభుత్వం నోరుమెదపడం లేదు. పాలన ముగిసే సమయంలో చివరి ఏడాదిలో అమలు చేస్తారా అంటూ పోలీస్ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీక్లీ ఆఫ్ లేకపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలవుతున్నారు. పోలీసులు లేకుండా అడుగు బయట పెట్టలేని నాయకులు.. వారి బాగోగుల గురించి మాత్రం పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. వీక్లీఆఫ్ ఇవ్వకపోవడమే కాకుండా విజయవాడకు టర్మ్ డ్యూటీల పేరుతో పోలీస్ సిబ్బందికి నరకం చూపిస్తున్నారు. సిఎం క్యాంప్ ఆఫీస్, గన్నవరం ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రతినెలా జిల్లాలోని పోలీస్ సిబ్బందికి టర్మ్ డ్యూటీలు కేటాయిస్తున్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో పది నుంచి 12 మంది సిబ్బంది వరకూ టర్మ్ డ్యూటీలు చేస్తుంటారు. ఈ డ్యూటీ 15 రోజులు చేయాల్సి ఉంటుంది. టర్మ్ డ్యూటీలు చేస్తున్న పోలీస్ సిబ్బందికి అక్కడ ఎటువంటి వసతులూ కల్పించడం లేదు. తినడానికి తిండి, ఉండడానికి చోటు కూడా ఇవ్వరు. సొంత ఖర్చులతో 15 రోజులు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. దీంతో రోజుకు రూ.500కుపైగా ఖర్చవుతోంది. అంతేకాకుండా ఆరోగ్యం దెబ్బతింటుంది. టర్మ్ డ్యూటీలు రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పోలీసులకు ఇచ్చిన ఏఒక్క హామీనీ కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదు. కానిస్టేబుల్ కొడుకునని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మౌనం వహించడంపై పోలీస్ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేశ్వరరావు

ట్రంప్ సుంకాలపై మోడీ మౌనం వీడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు

స్మార్ట్ మీటర్ల బలవంతపు బిగింపు ఆపాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం



మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - తణుకు

దేశంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధిస్తే దేశ ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం స్థానిక రోటరీ క్లబ్ హాల్లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, చింతకాయల బాబూరావు, కేతా పద్మ వ్యవహరించారు. తొలుత సమావేశం ప్రారంభ సూచికగా అరుణ పతకాన్ని పార్టీ రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం ఆవిష్కరించగా, సంతాప తీర్మానాన్ని కేతా గోపాలన్ ప్రవేశపెట్టారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అత్యుతానందన్‌కు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ట్రంప్ మన దేశంపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తుంటే మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో 25 శాతం సుంకాలు పెంచుతున్నట్లు ప్రకటించిన ట్రంప్ అనధికారంలోనే మరో 25 శాతం పెంచి మొత్తం 50 శాతం దేశంపై వేస్తే మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం ఆపడం తన కీర్తి అని ట్రంప్ స్వయం ప్రకటిత ప్రచారాన్ని కూడా ఖండించకపోవడం దారుణం అన్నారు. ఒకవైపు దేశభక్తి పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్న మోడీ, మరోవైపు ట్రంప్‌నకు తలొగ్గడం దేశం పరువు తీయడమేనని తెలిపారు. టంప్ వేసిన సుంకాల వల్ల రాష్ట్రంలో ఆక్వా రైతులపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రకటన వల్ల ఆక్వా రంగం కుదేలైందని, ఆక్వా రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. మోడీపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశాయి.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో బలవంతపు స్మార్ట్ మీటర్లను ఆపాలన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణలో భాగంగా అదానీ స్మార్ట్ మీటర్లు బలవంతంగా బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల బిగింపు వేగవంతం చేయడం అన్యాయమన్నారు. నాడు వైసిపి చేసుకున్న అవినీతి ఒప్పందాన్ని నేడు కూటమి ప్రభుత్వం నీతి ఒప్పందంగా ఎలా మారుతుందని ప్రశ్నించారు. అనంతరం జిల్లాల్లో పరిశ్రమలు మూసివేత ఆపాలి, యువతకు ఉపాధి కల్పించాలి అనే తీర్మానాన్ని బి.వాసుదేవరావు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, పట్టణ కార్యదర్శి ఎ.అజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ సమైక్యతను కాపాడాలి

తిరంగా ర్యాలీలో విద్యార్థులతో కలిసి పాల్గొన్న కలెక్టర్

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యువత దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడేవిధంగా కలిసికట్టుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ దేశాన్ని ఉన్నత స్థితిలో ఉంచాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పౌరుల్లో జాతీయ జెండా పట్ల గౌరవ భావాన్ని పెంపొందించడమ్యేంగా సుమారు 2 వేల మంది కళాశాల విద్యార్థులతో 200 మీటర్ల భారత త్రివర్ణ పతాకాన్ని చేతబూని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాల నుంచి సాగిన భారీ ర్యాలీలో సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఇంటింటా జాతీయ జెండా పేరున కొనసాగుతున్న ఈ కార్యక్రమం మన ప్రధానమంత్రి మానస పుత్రిక అని, మన అందరం దేశభక్తితో కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మన రాష్ట్రం వారే కావడం ఎంతో గర్వకారణం అన్నారు. జెండా ఎగురవేసి ఐక్యతను ప్రదర్శించేందుకు ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకూ ఇళ్లు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో జెండాలను ఎగురవేయాలన్నారు. జిల్లాలోని పౌరులందరూ వారి ఇళ్లల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని, హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో పాల్గొనాలని తెలిపారు. ఎందరో మహానుభావులు ప్రాణాలు, జీవితాలు, ఆస్తుల త్యాగాల ఫలితంగా మనం నేడు స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామన్నారు. యువత దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడే విధంగా కలిసికట్టుగా ఉండి తమ వంతుగా దేశానికి ఎంతో కొంత సేవచేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. ర్యాలీకి ముందు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో దేశభక్తిపై వివిధ పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా టూరిజం అధికారి అప్పారావు, కళాశాల ప్రిన్సిపల్, భారీ సంఖ్యలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ

బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రం ప్రభుత్వం చేస్తున్న ఐడిబిఐ బ్యాంకు ప్రయివేటీకరణ ప్రయత్నాలను ఆందోళనల ద్వారా ఆపివేస్తామని రాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల కార్యదర్శి టివి.సూర్యనారాయణ తెలిపారు. ఐడిబిఐ ప్రయివేటీకరణ ప్రతిపాదనల నేపథ్యంలో ఆ బ్యాంకు యూనియన్లు దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా సోమవారం తాడేపల్లిగూడెంలో బ్యాంకు ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ నాయకులు నిరసనలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి టివి.సూర్యనారాయణ, కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్-ఎస్.ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకులు దేశానికి వెన్నెముక వంటివని తెలిపారు. 50 సంవత్సరాల చరిత్ర కలిగి లాభాల్లో ఉన్న ప్రభుత్వ బ్యాంకు ప్రయివేటీకరణ యత్నాలను ఆపుచేస్తామని హెచ్చరించారు. జాతి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయివేటీకరణ ప్రయత్నాలను నిలుపుదల చేయాలన్నారు. లేకుంటే ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ప్రస్తుతం బ్యాంకు 2,100 శాఖలతో లాభాల్లో నడుస్తోందని తెలిపారు. ప్రభుత్వ అజమాయిషీలో ఉన్న బ్యాంకును ప్రయివేటుపరం చేయడం, విదేశీ ప్రయివేటు కంపెనీలకు ఇవ్వడం దేశ వ్యతిరేకం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది, కోఆర్డినేషన్ కమిటీ నాయకులు బి.ఏడుకొండలు, జిఎన్‌వి.ప్రకాష్, పాలూరి సత్యనారాయణ, కె.శ్రీనివాస్, సిద్దాబత్తుల సూర్యనారాయణ, షరీఫ్, ఎం.వీరబాబు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలతోనే వైసిపి పాలన

తణుకు ఎఎంసి పాలకవర్గ అభినందన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - తణుకు

ఐదేళ్లలో వైసిపి పాలన రైతు వ్యతిరేక విధానాలతోపాటు రైతు దగా పార్టీగా వ్యవహరించిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తణుకు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని తణుకు విశె కన్వెన్షన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గత టిడిపి హయాంలో చంద్రబాబునాయుడు రైతు పక్షపాతిగా వ్యవహరించి వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం రైతులను అన్ని విధాలా దగా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేశారన్నారు. తణుకు ఎఎంసిని అభివృద్ధి చేయడానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. తణుకు మార్కెట్ కమిటీకు సొంత స్థలం సేకరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో కూటమి జెండాను ఎగరవేయాలని కోరారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం మోసకారి సంక్షేమాన్ని అమలు చేసిందని విమర్శించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తణుకు ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ మాట్లాడుతూ తణుకు మార్కెట్ కమిటీని ఎంఎల్ఎ రాధాకృష్ణ సహకారంతో అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు. అనంతరం ఎఎంసి ఛైర్మన్ కొండేటి శివ, వైస్ ఛైర్మన్ వల్లూరి మోహన్‌లతోపాటు డైరెక్టర్లను అభినందించారు. రాజ్యసభ మాజీ సభ్యులు తోట సీతారామలక్ష్మి, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి పీతల సుజాత, బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, మాజీ ఎంఎల్ఎలు ముళ్లపూడి వెంకటకృష్ణారావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు దొమ్మేటి వెంకటసుధాకర్, పరిమి వెంకన్నబాబు పాల్గొన్నారు.

జిఒ 137ను రద్దు చేయాలి

ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా రీజియన్ కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆర్‌టిసి స్థలాలను 'లులు షాపింగ్ మాల్'కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 137ను రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా రీజియన్ కార్యదర్శి అల్లం సత్యనారాయణ తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఆస్తులు ప్రయివేటు వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేస్తున్న చర్యలను ప్రజలంతా ఖండించాలన్నారు. విజయవాడ నడిబొడ్డునున్న గవర్నర్‌పేట-1, 2 డిపోలు, పాతబస్టాండ్ స్థలం రూ.నాలుగు వందల కోట్ల విలువ చేసే 4.15 ఎకరాలను లులు షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టి, ఆ డిపోలు మూసేసి 200 బస్సులను, 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడచినా డిఎ బకాయిలు ఇవ్వలేదని, 12వ పిఆర్‌సి, ఐఆర్ లేదని ఆయన విమర్శించారు. గాజువాక డిపోను విక్రయించే ఆలోచన విరమించుకోవాలన్నారు. భీమవరంలోని స్టాఫ్ క్వార్టర్స్‌ను బలవంతంగా ఖాళీ చేయించారని, ఆ స్థలాన్ని అమ్మేస్తారన్న వార్తలు వస్తున్నాయని, తిరిగి అక్కడ స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ నాయకులు ఎంఆర్‌పి.రాజు మాట్లాడుతూ ఆర్‌టిసి స్థలాలను 99 ఏళ్లకు లీజుకిచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్ మాట్లాడుతూ భీమవరంలోని ఆర్‌టిసి స్థలాలను పరిరక్షించాలని, స్టాఫ్ క్వార్టర్స్ తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు చినమిల్లి శ్రీనివాసులు, బి.అరుణ, కెఎస్.రాజు పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. దీంతో ఉదయం దాదాపు పట్టణంలోని వీధులు మురికి కూపంగా మారి చెరువులను తలపిస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి ఆకుకూరలు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసే జిల్లాలోని ఇతర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్ ద్వారా వచ్చిన వినతులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతులు పరిష్కరించకుండా ఆలస్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు జిల్లాలో పలు ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 180 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, పిజిఆర్‌ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఎస్‌సి వర్గీకరణతో మాలలకు అన్యాయం

జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎస్‌సి వర్గీకరణ పేరుతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మాలల హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మాల సంఘాల జెఎసి అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ మాలల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. మాలలకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలకు త్వరలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. మాల సంఘాల జెఎసి అధ్యక్షులు చీకటపల్లి మంగరాజు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ధర్నాలో గుండే నగేష్, కర్ని జోగయ్య, ఏనుగుమిల్లి చంద్రశేఖర్, తండా ఇస్సాక్, మట్టా చంద్రశేఖర్, గుజ్జుల నిరీక్షణరావు, వర్ధనపు మోషే, పరువు వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల శామ్యూల్ రాజ్, బత్తుల కృష్ణ, మద్దా జయపాల్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ సమయాల బోర్డు పెట్టాలి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ సమయాలు తెలిపే బోర్డును ఏర్పాటు చేయాలని రైల్వే పాసింజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రైల్వే ఉన్నతాధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వీరవాసరం రైల్వే స్టేషన్‌లో అందుకు సంబంధించిన సమాచారం తెలియజేసే బోర్డు లేదన్నారు. ఈ విషయం గతంలో స్థానిక రైల్వే శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమాచారం బోర్డు లేకపోవడం వల్ల ప్రయాణికులు పడే ఇబ్బందులను వారికి వివరించామని, అయినప్పటికీ సమాచారం బోర్డు ఏర్పాటు చేయడంలో రైల్వే అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. రిజర్వేషన్ సమాచారం తెలిపే బోర్డు లేకపోవడం వల్ల అనేక మంది సరైన సమయంలో రిజర్వేషన్లు పొందలేక అధిక రుసుం చెల్లించి ప్రయివేటు కేంద్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణం రిజర్వే షన్ సమయాలు తెలిపే బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతానికి అధికారులందరూ కలిసికట్టుగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీన జిల్లా అంతటా నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం గోడ పత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పిల్లలు, కిషోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పౌష్టికాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారన్నారు. అదేవిధంగా శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారన్నారు. ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ డాక్టర్ జి.గీతా బాయి, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ సిహెచ్.భావన, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీమన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

వీరవాసరం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గాయత్రి అన్నారు. ఈనెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వీరవాసరం హైస్కూల్, రాయకుదురు జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నులిపురుగుల మాత్రల పంపిణీ సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాత్రలు పంపిణీ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. మాత్రలు ఆయా సెంటర్లకు చేరాయా లేదా అనే విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.రాజేష్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశ పాల్గొన్నారు.

ఆకివీడు : వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తహశీల్దార్ సందాని వెంకటేశ్వరరావు చెప్పారు. ఈనెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి, ఐసిడిఎస్ సిబ్బంది సంయుక్తంగా ఆకివీడు కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఇ.మార్కండేయ ఈశ్వరరావు మాట్లాడుతూ సంవత్సరం నుండి 19 సంవత్సరాల మధ్య వయసు కలవారు ఈ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. ఎంఇఒ ఎ.రవీంద్ర, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి వాణి రత్నం పలు సూచనలు చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జివి.రమణ, సూపర్‌వైజర్ మహమ్మద్ సుభాన్ బేగ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు. అనంతరం ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు.

మొగల్తూరు : చిన్నారులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మొగల్తూరులోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పిహెచ్‌సి వైద్యులు కె.లక్ష్మీశ్రావణి ఆధ్వర్యాన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంఇఒ యు.శ్యామ్యూల్ జాన్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

నేడు గూడెంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

తాడేపల్లిగూడెం : ప్రజలందరూ దేశభక్తిని చాటుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘ సిబ్బందితో ముందస్తు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎవిఏఆర్ సర్కిల్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు మెగా సైకిల్ ర్యాలీని రాష్ట్ర పియుసి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా దేశ ఐక్యతను పెంపొందించడానికి, సామాజిక స్పృహను పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు.

యాచకులకు ఆహారం వితరణ

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక హిరో షోరూమ్ వద్ద యాచకులకు ఆహార వితరణ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యాన కార్యదర్శులు వెలంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలతోపాటు పేదవారి ఆకలి తీర్చే విధంగా ఈ సేవలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెవిఎన్.మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా గణపతి

ఆకివీడు : ప్రభుత్వం చేపట్టిన నియామకాల పరంపరలో భాగంగా స్థానికంగా ఎంతో ప్రాచుర్యం పొందిన పెద్దింట్లమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా నియమిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ రామచంద్రరావు తెలిపారు. నూతన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఆకివీడు మాజీ సర్పంచి, టిడిపి పశ్చిమభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్లు గణపతి నియమితులయ్యారు. ట్రస్ట్ సభ్యులుగా కె.లలితా కుమారి, ఒరుగంటి లక్ష్మి, బి.శ్యామల, అరసవల్లి రామచంద్రరావు, పెదపాటి నారాయణరావు, కిమిడి వెంకట్రావు, డి.వెంకటేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా దేవస్థానం అర్చకులు పట్నాల రామయ్య నియమితులైనట్లు ఆయన తెలిపారు. త్వరలో వారు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

నేడు డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రిన్సిపల్ నిర్మలకుమారి

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి సోమవారం తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రజల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న వారందరూ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

మానసిక వికలాంగులకు బిస్కెట్లు పంపిణీ

పాలకొల్లు : స్థానిక అంజలి మానసిక వికలాంగుల స్కూల్‌లో పాలకొల్లు యునైటెడ్ కాపు క్లబ్ సారథ్యంలో అధ్యక్షులు కనూరి ప్రభాకర్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ పెనుమాక రామ్మోహన్ రావు, క్లబ్ కార్యదర్శి గుండుమోలు వీరాస్వామి, ట్రెజరర్ కొండిశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

భీమవరం టౌన్ : ఈనెల 13వ తేదీన భీమవరం డిఎన్ఆర్ కళాశాల రోడ్డులోని ఎస్ఎల్ గ్రాండ్‌లో జెసిఐ, జెకాం ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జెకాం భీమవరం ఛైర్మన్ పెదమల్ల రాము, వైస్ ఛైర్మన్ పేరిచర్ల కృష్ణంరాజు, సెక్రటరీ పులగం మధుబాబు, ట్రెజరర్ బొండాడ కృష్ణకాంత్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అపోహలను వదిలి, స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. ఈనెల 13న ఉదయం 8 గంటల నుండి రక్తదాన శిబిరం జరుగుతుందని, ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'రైతు సంబరాల సభను జయప్రదం చేయండి'

భీమవరం టౌన్ : ఈనెల 13వ తేదీన రైతు సంబరాలు నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి కోరారు. ఆమె అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంతో రాష్ట్రంలో రైతులు ఆనందం, సంతోషంతో ఉన్న సందర్భంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతు సంబరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా భీమవరం పట్టణంలో 13వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు భీమవరం బురదర గ్రౌండ్ సర్కిల్ (గ్రాండ్) నుండి ట్రాక్టర్ ర్యాలీతో బయలుదేరి భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఆవరణలో రైతు సంబరాల సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సభకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్రశాసన సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, పివిసి ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, ఇతర కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొంటారని తెలిపారు. టిడిపి పట్టణ కోశాధికారి మెంటే గోపి, ఉండ్రుగంటి సత్యనారాయణ సభను జయప్రదం చేయాలని కోరారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, టిడిపి సీనియర్ నాయకుడు కటిరెడ్డి రామచంద్రరావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కోళ్లేపర శ్రీనివాస్, మద్దుల రాము, కొయ్యలగుడ్ గణపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మున్సిపల్ కార్యాలయంపై ఉన్న మొక్కలు

మున్సిపల్ కార్యాలయంపై పచ్చదనం..

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం-పరిశుభ్రత అంటూ ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా సిబ్బందిలో మార్పు కనిపించడం లేదు. పాలకొల్లు మున్సిపాలిటీ పచ్చదనం కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. అయితే సిబ్బందికి చిత్తశుద్ధి కొరవడుతోంది. మున్సిపల్ కార్యాలయంలోని భవనాలపై పెంచుకున్నా.. వచ్చే మొక్కలను కొట్టక పోవడంతో అవి వృక్షాలుగా మారి బిల్డింగ్ గోడలు బద్దలు కొట్టి మరీ ఎదుగుతున్నాయి.

సీతారామపురం సొసైటీ ఛైర్మన్‌గా వీరాస్వామి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సొసైటీ) త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా కలవకొలను వీరాస్వామి(తాతాజీ) నియమితులయ్యారు. వీరాస్వామి ఐదవసారి సొసైటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కమిటీ సభ్యులుగా దొంగ శ్రీరామచంద్రుడు, యర్రంశెట్టి మావులయ్యను నియమించడంపై గ్రామస్తులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ సీతారామపురం గ్రామ వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘ అభివృద్ధికి కృషి చేసి మంచి గుర్తింపు తీసుకువస్తానని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ రుణాలు మంజూరు చేయడంలో కృషి చేస్తానన్నారు.

నరసాపురం సొసైటీ ఛైర్మన్‌గా రామారావు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా అధికారి అనంత రామారావు నియమితులయ్యారు. అనంత రామారావు ప్రస్తుతం టిడిపిలో కొనసాగుతున్నారు. కమిటీ సభ్యులుగా బొక్కా సత్యనారాయణ, పెరుమాళ్ల సత్యనారాయణను నియమించడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత రామారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ నరసాపురం సొసైటీ అభివృద్ధికి కృషి చేసి మంచి గుర్తింపు తీసుకు వస్తానని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ రుణాలు మంజూరు చేయడంలో కృషి చేస్తానన్నారు.

వెలగలేరు సొసైటీ ఛైర్మన్‌గా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని వెలగలేరు పిఎసిఎస్‌కు త్రి సభ్య కమిటీ నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చినట్టు సొసైటీల రిజిస్ట్రార్ ముజిబుర్ రెహమాన్ సోమవారం ఇక్కడ తెలిపారు. ఈమేరకు వెలగలేరు సొసైటీ ఛైర్మన్‌గా నెగ్గిపూడికి చెందిన బొక్కా నాగేశ్వరరావు, సభ్యులుగా మల్లిడి మీరా రెడ్డి(మార్టేరు), చిర్ల నాగేశ్వర రెడ్డి(వెలగలేరు) నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తనకు ఇంత చక్కటి అవకాశం ఇచ్చిన మాజీమంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సహకారంతో సొసైటీ అభివృద్ధికి పాటు పడతానని అన్నారు.

నిధుల మంజూరుతో రైతుల్లో హర్షం

మార్టేరు నుంచి పెనుగొండ వరకు భారీ ట్రాక్టర్ల ర్యాలీ

పాల్గొన్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులు మండలంలోని మార్టేరు నుండి పెనుగొండ వరకు సోమవారం సాయంత్రం ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకు పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ట్రాక్టర్ నడిపి తాను రైతు బిడ్డనేనంటూ ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా రైతులంతా కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని సంతోషం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో అన్నదాతను దగా చేశారని మండిపడ్డారు. గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ఎరువుల వ్యవహారాన్ని నిర్లక్ష్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రైతులకు మేలు చేస్తూ భరోసా ఇస్తున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని పితాని సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బులిరామిరెడ్డి, బోడపాటి దుర్గాప్రసాద్, తేతలి రాజారెడ్డి, సీతారాం పాల్గొన్నారు.

నరికేసిన చెట్టు

పర్యావరణానికి తూట్లు

పొలమూరులో ఏపుగా పెరిగిన చెట్లు నరికివేత

పెనుమంట్ర : ఓ పక్క పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా మొక్కలు పంపిణీ చేసి స్కూల్ విద్యార్థులతో సహా ప్రజలందరిచేతా మొక్కలు నాటించే కార్యక్రమాలు చేస్తుంటే స్థానిక మండలంలోని పొలమూరులో వ్యవసాయ శాఖ సొసైటీ సమీపంలో ఏపుగా పెరిగిన చెట్లను కొందరు నరికివేశారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఈవైనం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా అయ్యే తీగలకి చెట్ల కొమ్మలు అడ్డొస్తున్నాయని నరికేస్తున్నారని, ఎన్నో ఏళ్లనాటి చెట్లను నరికివేసిన వారి పట్ల చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధర్మారావు ఫౌండేషన్ సేవలు అభినందనీయం

పాలకొల్లు రూరల్ : ధర్మారావు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడి విజయ భాస్కర్ అన్నారు. పూలపల్లి గ్రామంలో సత్తిబాబు ఇంట్లో వంటగ్యాస్ లీక్ వల్ల ఇంట్లో సామానులు అగ్నికి ఆహుతయ్యాయి. వీరి కుటుంబానికి ధర్మరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేగేష్న శ్రీహరి రాజు, విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, గుబ్బల హరిప్రసాద్, ఉనికల నాగేశ్వరరావు, గోనేడ రామకృష్ణ, గబిడి నరసింహారాజు ఉన్నారు.

ఎంఇఒ-2గా ఏసుదాసు

ప్రజాశక్తి - కాళ్ల

ఎంఇఒ2ను అభినందిస్తున్న ఎస్‌టియు నాయకులు

మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని సీసలి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల ఏసుదాసు అన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2గా పాల ఏసుదాసు సోమవారం విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ నూతన మార్గదర్శకాలు అనుసరించి ఏ మండలానికి ఆ మండలంలో సీనియర్ హెచ్‌ఎంలను ఎంఇఒ-2గా నియమించమని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిర్ణయంతో మండలంలో జెడ్‌పిహెచ్ఎస్ సీసలి గ్రేడ్-2 హెచ్‌ఎంగా ఉన్న పాల ఏసుదాసును నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వి.జానకీరామరాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వి.జనార్ధన్ రావు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.మోహన్ బాబు, పి.త్రినాథ్ వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షులు వంకా గణేష్, ప్రధాన కార్యదర్శి పాపారావు, ఫైనాన్స్ సెక్రటరీ నాగప్రసాద్, మండల అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాళ్ల ప్రసాద్, మండల అదనపు ప్రధాన కార్యదర్శి వంక త్రినాథ్ అభినందించారు.

కోపల్లె సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

ఛైర్మన్ నంద్యాల రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల



నంద్యాల రామరాజును అభినందిస్తున్న బ్యాంకు సిబ్బంది

వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషిచేస్తానని నూతనంగా నియమితులైన సొసైటీ ఛైర్మన్ నంద్యాల రామరాజు(హాట్ లయన్స్ బాబు) తెలిపారు. సోమవారం కోపల్లె సహకార బ్యాంకు సిఇఒ జంపన సాయిగీత, బ్యాంకు సిబ్బంది బృందం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ నంద్యాల రామరాజు, డైరెక్టర్లు గడి రాము, బుంగ ఆదాములకు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నంద్యాల రామరాజు మాట్లాడుతూ రైతులకు సహకార సంఘం ద్వారా రుణాలు ఇచ్చి ఆదుకుంటామని, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతుల అభివృద్ధి ధ్యేయంగా సహకార సంఘం పనిచేయాలని తెలిపారు. ఈనెల 14వ తేదీ గురువారం ఉదయం నూతనంగా నియమించిన ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని, కూటమి నాయకులు, కార్యకర్తలు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

సామాజికవేత్త చెరుకువాడ రంగసాయి

ప్రజాశక్తి - నరసాపురం



రంగసాయిని సత్కరిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

ఇంజనీరింగ్ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు నిరంతరం కృషిచేయాలని సామాజిక వేత్త చెరుకువాడ రంగసాయి అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి ఏడాది తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. నాలుగేళ్ల పాటు మీరు కష్టపడి చదివితే 100 ఏళ్ల పాటు జీవితాన్ని హాయిగా గడపొచ్చన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఛైర్మన్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ కాలేజీలో కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఉన్నత స్థితికి చేరుకునేందుకు ఇంజనీరింగ్ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కోశాధికారి కె. త్రినాథ్ మాట్లాడుతూ విద్యార్థుల నడవడికలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులు చదువులు సాగించాలన్నారు. కొత్త కొత్త కోర్సులు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం రంగసాయిని పాలకవర్గం అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, గోపిచంద్, స్వామినాయుడు పాల్గొన్నారు.

అర్జీలు నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 31 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి వేదిక ద్వారా ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గూడెం పిజిఆర్ఎస్‌కు 5 అర్జీలు

తాడేపల్లిగూడెం : ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఎస్.బాబు కోరారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 3, ఇంజనీరింగ్ విభాగంలో 1, పెన్షన్‌కు సంబంధించి 1 మొత్తం 5 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వైవి.రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి. రవికుమార్, ఎసిపి జి.సీతారాం, మేనేజర్ ఎం.రవి సుధాకర్, డాక్టర్ ఎన్.రాజు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 4 అర్జీలు

మొగల్తూరు : మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. పాస్ పుస్తకంకు ఒక వినతి, దారి ఇప్పించాలని కోరుతూ ఒక వినతి, కుల ధ్రువీకరణ పత్రంకు ఒక వినతి, తల్లికి వందనంకు ఒక వినతి అందాయని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన్నికైన వస్త్రాలను అందించాలి

వారాహి సిల్క్స్ ప్రారంభంలో ఎంఎల్ఎ అంజిబాబు

షో రూం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : ఖాతాదారులకు మన్నికైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం కురిశేటివారి వీధిలో వారాహి సిల్క్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అధునాతనమైన వస్త్ర దుకాణాలు మన ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. షోరూం ప్రొపెటర్ బోండా శ్రీరామూర్తి, కృష్ణతేజ, బోండా ప్రవీణ్ మాట్లాడుతూ అపరిమితమైన కలెక్షన్స్, అద్భుతమైన మోడల్స్ అత్యంత అందుబాటు ధరలతో అందించడమే వారాహి సిల్క్స్ ప్రత్యేకత అని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్నో ఆఫర్స్‌ను అందుబాటులో ఉంచామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ వద్ద మహిళల నిరసన

ఉండి: పాములపర్రు గ్రామంలో వివాదాస్పదమైన శ్మశాన భూమి రికార్డులను అధికారులు తారుమారు చేశారనే ఆరోపణల నేపథ్యంలో దళిత మహిళలు సోమవారం గ్రామపంచాయతీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు చెందిన శ్మశాన భూమి రికార్డులు మార్చి భూస్వాములకు మద్దతుగా నిలిచిన గ్రామపంచాయతీ కార్యదర్శిని దీనిపై అడగడానికి వెళ్లగా పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి ఇద్దరు కార్యాలయం తలుపులు వేసి బయటికి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి కొందరు వెళ్లారని కలెక్టర్ వచ్చి స్వచ్ఛందంగా విచారణ పూర్తి చేయాలని వారు కోరారు.

వికలాంగులకు వాహనాల పంపిణీకి చర్యలు

ఆకివీడు : రాష్ట్రంలోని వికలాంగులకు మూడు చక్రాల 16 వాహనాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అయిభీమవరం గ్రామ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నుండి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహకార సంస్థ ఈమేరకు మార్గదర్శకాలను విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్ర నివాసి అయి ఉండి, 70 శాతంపైగా వైకల్యం కలిగి, కనీసం పదవ తరగతి పాసై ఉండాలి. 3 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండి, వాహనం పొందేందు కనీసం మూడు నెలల ముందు నుండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. గతంలో ఎటువంటి వాహన సౌకర్యం పొందని, సొంత వాహనం లేని వారు అర్హులని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కానీ వారు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. అందుకోసం జిల్లా మెడికల్ బోర్డు వారిచ్చిన సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్, పదవ తరగతి సర్టిఫికెట్, ఎస్ సి, ఎస్‌టి వారైతే కుల ధృవీకరణ పత్రాలు, వికలాంగుల పూర్తి ఫొటో, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్థులైతే బోనఫైడ్ సర్టిఫికెట్, గతంలో ఎటువంటి వాహనాలు తీసుకోలేదని సొంతంగా డిక్లరేషన్‌లు ఇవ్వవలసి ఉంటుందన్నారు. రోస్టర్ సిస్టంలో రిజర్వేషన్ ప్రకారం, విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అర్హులు అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సిఎంఆర్‌ఎఫ్ నిధుల కింద సోమవారం 34 మందికి రూ.22.39 లక్షలు క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో సిఎం సహాయ నిధిని రద్దు చేయగా చంద్రబాబు మానవత్వంతో పునరుద్ధరించారన్నారు. చంద్రబాబు ఏడాది పాలన పట్ల అన్ని తరగతుల ప్రజలు సంతృప్తి, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పుల పాలు చేశారని చెప్పారు. రాష్ట్ర విభజన నష్టం కన్నా జగన్ ఐదేళ్ల పాలనలో నష్టమే ఎక్కువ జరిగిందన్నారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం తీసుకొస్తున్నామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేసామన్నారు. నియోజకవర్గంలోని కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణ

ఉండి : మండలంలోని ఆరేడు గ్రామంలో వేంచేసియున్న తాండవేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన ఛైర్మన్‌గా గొట్టం రామకృష్ణను నియమించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. సభ్యులుగా పిప్పిరిశెట్టి సుబ్బారావు, చల్లా సంధ్య గాయత్రి, నక్కా దుర్గారావు, బండి ఆదిలక్ష్మి, కోడే వరలక్ష్మి, ఎంఎన్‌విఎస్ దుర్గాప్రసాద్, గొన్నబత్తుల వెంకటరమణ, పాలకోడేరు నాగలక్ష్మి, కొండవీటి కాశీ విశ్వనాథ శాస్త్రిలను నియమించారు. ఈ సందర్భంగా గొట్టం రామకృష్ణ మాట్లాడుతూ తనను నమ్మి ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రఘురామకృష్ణరాజు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత

మాజీ మంత్రి వెంకట నాగేశ్వరరావు

తణుకు : ఇది ప్రజాస్వామ్య దేశమని, ఈ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఉన్న ప్రతీ పౌరుడు ఎవరికి నచ్చిన పార్టీకి వాళ్లు ఓటు వేసుకుంటారని మాజీ మంత్రి, రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ తమకు ఈ పరిపాలన బాగుంది వీళ్లకి ఓటు వేయాలనే స్వేచ్ఛ ఈ భారతదేశంలో ఉందన్నారు. పులివెందులలో జెడ్‌పిటిసి ఎన్నికలకు సంబంధించి ఆ ప్రాంతంలో పట్టు సాధించాలని కూటమి నేతలు రాక్షసత్వాన్ని ప్రదర్శించి ఎంఎల్‌సితో పాటు పార్టీ శ్రేణులపై దాడికి దిగి నీచపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓటు శాతాన్ని తగ్గించేందుకు ఇటువంటి కుట్రలకు దిగుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. కార్యక్రమంలో వడ్లూరి సీతారాం, యిండుగపల్లి బలరామకృష్ణ, మెహర్ అన్సారీ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం తాళ్ళచెరువు గ్రామానికి చెందిన కేత వీరాస్వామి అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. వంకతాళ్ళచెరువు ఇంటి దగ్గర నుండి ఆచంట సెంటర్‌కు వెళ్తుండగా నాయొక్క పాస్ పోర్ట్ నంబర్ : N0752767 గల పాస్ పోర్ట్ ఏవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కేత వీరస్వామి, తండ్రి : నరసింహ మూర్తి
డోర్ నెం : 14 - 37, వంకతాళ్ళ చెరువు
ఆచంట మండలం
సెల్ : 9502455557

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం కాపురస్తులు బోడా హేమంత్, తండ్రి శ్రీనివాసరావు, వయసు. 31 సంవత్సరాలు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం, ఇంటి స్థలంకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెంబర్ 1568/1989 (ఏలూరు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్)లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు, ది 08-08-2025 న, శనివారపుపేట నుండి ఫైర్ స్టేషన్ సెంటర్‌కి వెళ్తుండగా నా హ్యాండ్ బ్యాగ్‌తో పాటు పోయింది. దొరికిన వారు దయచేసి ఈ ఫోన్ నంబర్ కి (6302383269) కాల్ చేయగలరు. అందచేసి తగిన బహుమతి పొందగలరు.

బోడా హేమంత్, తండ్రి.శ్రీనివాసరావు
డోర్.నం.19-143, ఫ్లాట్ నం.FF-3, ఫస్ట్ ఫ్లోర్,
మాదు తిరుపతిరావు నగర్, యనమలకుదురు గ్రామం,
పెనుమలూరు మండలం, కృష్ణా జిల్లా.

పాస్‌పోర్టు పోయినది

ఉల్లంపర్తి రూనే సుశీల్, తండ్రి, స్టీఫెన్ వీరా సుధీర్, డోర్ నెంబర్ 4-5-38, క్రిష్టియన్ పేట, 31వ వార్డు, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను ది 15-09-2016 లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి P0635375 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. నేను ది 28-7-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరులో నా బంధువు వద్దకు వీసా గురించి మాట్లాడటానికి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ తో బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడి పోయినవి.ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9849671119

శ్రీ శోభనాచల మరియు మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానం

ఆగిరిపల్లి - దేవదాయ, ధర్మాదాయ శాఖ

భూమి కౌలు హక్కు ప్రకటన

ఆగిరిపల్లి గ్రామములో గల శ్రీ శోభనాచల మరియు మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం తాలుకా భూమి దిగువన ఉదహరించిన భూమి 3 సంవత్సరముల కాల పరిమితికి అనగా 2025-2026 నుండి 2027-2028 వరకు లీజుకు ఇచ్చుటకు అధికారుల సమక్షములో బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరణ	తేదీ, సమయం, ప్రదేశం	ధరావత్తు	స్వభావము
1.	R.S.No.248 య.5.00 వడ్లమాను Hill ఏరియా	ది.21-08-2025వ తేదీ ఉ.10.00 గం॥ దేవస్థానం కార్యాలయం నందు	15,000/-	(కొండ ఏరియా) మెరక

ఇతర విషయములకు కార్యాలయం నందు గాని ఫోన్ ద్వారా గాని 9848146455 తెలుసుకొనవచ్చును.

ఆగిరిపల్లి, తేది.08-08-2025 సం/- కార్యనిర్వహణాధికారి